

# క్లాప్ డ్రైవర్ల పెండింగ్ జీతాలిప్పించాలి

**- మంత్రికి సిఐటియు బృందం వినతి**

మంత్రి భరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

క్లీన్ ఆంధ్రప్రదేశ్ డ్రైవర్ల పెండింగ్ జీతాలు ఇప్పించాలని కోరుతూ సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ రామాంజనేయులు అధ్యక్షతన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, క్లాప్ డ్రైవర్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి క్యాంప్ ఆఫీసులో వినతి పత్రం ఇచ్చారు. క్లాప్ డ్రైవర్ల పెండింగ్ జీతాల విషయం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు మంత్రికి వివరిస్తూ స్వచ్ఛ ఆంధ్ర క్లాప్ డ్రైవర్ల పెండింగ్ జీతాలు ఇప్పించి, పని భద్రత కల్పించాలని కోరారు. గత జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం స్వచ్ఛంద పేరుతో క్లాప్‌ను ఏర్పాటు చేసి దానికి డ్రైవర్లను నియమించారని తెలిపారు. దాని ప్రకారం కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ క్లాప్ డ్రైవర్ల జీతాలు ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్నందున కుటుంబాలు గడవకఅప్పులు చేసి బతుకుతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వం వారి బినామీ పేరున రెడ్డి ఏజెన్సీని సృష్టించుకుని క్లాప్ డ్రైవర్లకు అగ్రిమెంట్ ప్రకారం సరైన జీతం, ఇఎస్ఐ, పిఎఫ్‌లు ఇవ్వకుండా మోసం చేశారని మంత్రికి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మా సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేసినందున మున్సిపల్ కమిషనర్ జోక్యం చేసుకొని గతంలో నెలలు తరబడి పెండింగులో ఉన్న జీతాలను ఇస్తామన్నారు. అప్పటి నుండి ఏజెన్సీతో సంబంధం లేకుండా మున్సిపల్ కమిషనర్ రోజు రూ.400 చొప్పున నెలకు రూ.12 వేలు ఇస్తామని ఒప్పుకొని నాకు సంబంధం లేదు అన్నట్లు వ్యవహరిస్తూ కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నారని తెలిపారు. ఆయన బాధ్యత తీసుకోని మమ్ములను పనిచేయమన్నందున కార్మికులు పనిచేశారని, ఐదు నెలలుగా వారికీ జీతాలు ఇవ్వనందున ఇంటి బాడుగలు, కరెంట్ బిల్లులు, కిరాణం షాపులలో అప్పులు కట్టలేక ఇబ్బంది పడుతున్నారని వివరించారు. పరోపక్క స్కూల్ లు ఓపెన్ అయినందున పిల్లలను స్కూల్లో చేర్పించడానికి అవకాశం లేని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు.క్లాప్ డ్రైవర్లకు 7 నెలలు పెండింగ్ జీతాలు ఇప్పించి, గత కాలం నుండి పెండింగ్‌లో ఉన్న ఆల్టర్నేట్ డ్రైవర్ల జీతాలు కూడా ఇప్పించి పని భద్రత కల్పించగలరని కోరారు. ఈ విషయంపై మంత్రి స్పందిస్తూ మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి జీతాలు ఇప్పిస్తామని పని విషయం గవర్నమెంట్‌తో చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్లాప్ డ్రైవర్ల నాయకులు రఘు శేఖర్, రాజేష్, షఫీ, సుధాకర్, దశరథ్, దుర్గాప్రసాద్, అశోక్, ప్రసాద్, రవి, పరమేష్ క్లాప్ డ్రైవర్లు పాల్గొన్నారు.

# జిజిహెచ్‌లో సమస్యలను పరిష్కరిస్తాం

## - మంత్రి టిజి.భరత్ - ఆకస్మికంగా తనిఖీ -రోగులతో మాట్లాడిన మంత్రి

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

కర్నూలు సర్వజన వైద్యశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ అన్నారు. ప్రభుత్వ వైద్యశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అత్యవసర విభాగంతో పాటు డయాగ్నోస్టిక్ బ్లాక్, చిన్నపిల్లల విభాగం, ప్రసూతి విభాగాలను పరిశీలించారు. అక్కడున్న రోగులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రధానంగా విద్యుత్ కోతలు ఎక్కువగా ఉన్నాయని తన దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఎస్ఇ ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడినట్లు చెప్పారు. విద్యుత్ కోతలు లేకుండా ఉండేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని, చెత్త బుట్టలు ఏర్పాటుచేసి అంటువ్యాధులు రాకుండా పిచికారీ చేయాలని సూచించారు. చిన్న పిల్లల ఐసియు విభాగంలో గత ఐదేళ్లుగా ఎసిలు పనిచేయడం లేదన్నారు. ఇంతదారుణమైన పరిస్థితులు ఉన్నప్పటికీ ఇన్నాళ్లూ పరిపాలించిన నాయకులు ఏం చేశారో తెలియడం లేదన్నారు. రోగులకు మంచినీరు అందించాలన్న ఉద్దేశంతో తమ టిజివి సంస్థల తరుపున ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్స్ ఏర్పాటు చేశామని, అయితే నిర్వహణ లేక రోగులకు నీరు అందడం లేదన్నారు. తమ సిబ్బంది వచ్చి మినరల్ వాటర్ ప్లాంట్స్ ఎందుకు పనిచేయడం లేదో పరిశీలించి ఏం చేయాలన్న దానిపై ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు నివేదిక అందిస్తారన్నారు. ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో రోగులు తరలివస్తున్న ఈ ఆసుపత్రిలో పేరుకుపోయిన సమస్యలు ఒక్కొక్కటిగా తీరుస్తామని మంత్రి టిజి భరత్ తెలిపారు. అంతకుముందు ఎక్స్‌రే విభాగంలో వారం రోజులుగా ఎక్స్‌రే మిషన్ పనిచేయడం లేదని మంత్రి టిజి భరత్‌తో రోగులు సమస్యలు మొరపెట్టుకున్నారు. విద్యుత్ వైర్లను ఎలుకలు కొరికివేయడం వల్ల పదేపదే విద్యుత్ సమస్య తలెత్తుతుందని సిబ్బంది మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఎలుకల నివారణకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో కాంట్రాస్ట్ సిటి స్కాన్‌లు రోజుకు 5 మాత్రమే చేస్తున్నారని రోగులు చెప్పారు. గత కొన్ని రోజుల నుండి ఎన్ని సిటి స్కాన్‌లు చేస్తున్నారని మంత్రి రికార్డులను పరిశీలించారు. ఎక్కువ కాంట్రాస్ట్ సిటి స్కాన్‌లు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రోగులు కూర్చునేందుకు కుర్చీలు సైతం పాడై ఉండటంతో వెంటనే వాటిని మార్చాలని చెప్పారు. చిన్నపిల్లల విభాగం అపరిశుభ్రంగా ఉండటంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శానిటేషన్ సిబ్బందితో మాట్లాడి చెత్తబుట్టలు ఏర్పాటుచేసి వ్యర్థాలు బయటపడేయకుండా చూడాలన్నారు. తాగునీరు దొరకడం లేదని రోగులు వాపోయారు. సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

అధికారులతో మాట్లాడుతున్న మంత్రి భరత్

# జిల్లా కలెక్టర్‌కు సిపిఎం శుభాకాంక్షలు

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

కర్నూలు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.రంజిత్‌బాషాకు సిపిఎం బృందం కలిసి శుభాకాం క్షలు తెలిపింది. కలెక్టర్‌ను సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, పిఎస్.రాధాకృష్ణ, జి.రామకృష్ణ, కెవి.నారాయణ ఉన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు స్వాగతం పలికి జిల్లాలో ఉండే సమస్యలను ముఖ్యంగా తాగునీటి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, జిల్లాలో దెబ్బతిన్న రోడ్లను వేయాలని, సిక్స్‌లైన్ రోడ్డులో భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కనీస సౌకర్యాలు మెరుగు పరచాలని, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేయాలని వారు తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందిస్తూ జిల్లాల్లో సమస్యలను తప్పకుండా పరిష్కరించేందుకు కృషి చేస్తానని జిల్లాలో ఉండే అన్ని రాజకీయ పార్టీల ప్రజా సంఘాల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కారం కోసం కృషి చేస్తానని కలెక్టర్ తెలిపారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సిపిఎం నాయకులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

## డిజిపిని కలిసిన ఎమ్మెల్యే దస్తగిరి

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

ఎపి డిజిపి ద్వారక తిరుమలరావును కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టిడిపి సీనియర్ నేత విష్ణువర్ధన్ రెడ్డి శనివారం విజయవాడలోని డిజిపి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు వారు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పలు విషయాలను చర్చించారు. నియోజకవర్గంలో శాంతిభద్రతలపై పోలీసులు సహకరించేలా దృష్టి సారించాలని కోరారు.

# అతిసార కలకలం..!

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

తాగేనీరు కలుషితం అయ్యాయి. తాగునీటి పథకాల వద్ద అధికారులు, సిబ్బంది సరైన పరిశుభ్రతా చర్యలు చేపట్టకపోవడంతో తాగు నీరు గరళంలా మారుతున్నాయి. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో అతిసార విజృంభించింది. గ్రామాలకు గ్రామాలే వాంతులు, విరేచనాల బారిన పడ్డాయి. జూపాడుబంగ్లా మండలంలోని చాబోలు గ్రామంలో 35 మంది వరకూ అతిసార బారినపడ్డారు. ఒకరు మత్యువాతపడ్డారు. మంచినీటి ట్యాంకులలో చెత్త చెదారముతో నిండి, పరిశుభ్రత లేకపోవడం, అలాగే మంచినీటి ట్యాంకులో పక్షులు మతి చెందడంతో నీరు కలుషితంగా మారి ఆ నీటితోనే అతిసారం సంభవించిందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పత్తికొండ మండలంలో అతిసార ప్రభలింది. పత్తికొండ పిహెచ్‌సి పరిధిలో 160 మంది అతిసార రోగులకు చికిత్స అందించారు. కలుషిత నీటితో రోగాల బారిన పడి ఇబ్బందులు తప్పడం లేదని రోగులు పేర్కొంటున్నారు. మహానంది మండలం బసవాపురం గ్రామం పరిధిలో మంచినీటి ట్యాంకులు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. కర్నూలు నగరంలోనూ కలుషిత నీరు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. నగరంలోని విష్ణుటౌన్ షిప్, మాసాని సోమప్ప కాలనీ, నాలుగో పట్టణ ప్రాంతాల్లో తాగునీటి కుళాయిల్లో ఒండ్రుతో కూడిన కలుషిత నీరు వస్తున్నాయి. తాగేనీరు కలుషితమైతే తాము అనారోగ్యాల బారిన పడతామని పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు కలుషిత నీటిని తాగలేక డబ్బులు వెచ్చించి మినరల్ వాటర్‌ను కొనుగోలు చేసి తాగుతున్నారు.

**ఎంపీల ప్రమాణ స్వీకారం :** పార్లమెంట్ సభ్యులు(ఎంపీ)లుగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంట్‌లో వారితో ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ ప్రమాణ స్వీకారం చేయించారు. "పంచలింగాల బస్తిపాటి నాగరాజు అనే నేను.., డాక్టర్ బైరెడ్డి శబరి అనే నేను.." అంటూ ఇద్దరూ తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ప్రొటెం స్పీకర్‌కు నమస్కారం చేసి, రిజిస్టర్‌లో సంతకం చేసి వారి సీటు వద్దకు వెళ్లారు.

**సాగని సాగు :** ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సాగు ముందుకు సాగడం లేదు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా సాధారణ సాగు విస్తీర్ణంలో ఇప్పటి వరకూ 12.11 శాతం విస్తీర్ణంలో మాత్రమే పంటలను సాగు చేశారు. నంద్యాల జిల్లాలో సాధారణ సాగులో 6.77 శాతం మాత్రమే పంటలను వేశారు. నైరుతి రాకతో ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు కురిసినా.. తరువాత వర్షాలు పడకపోవడంతో విత్తనాలు విత్తేందుకు రైతులు జంకుతున్నారు. జులై 15 వరకూ ఖరీఫ్ పంటలను విత్తుకోవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

**పింఛన్ల పంపిణీకి సన్నాహాలు :** సామాజిక భద్రత పింఛన్లను రూ.4వేలు పెంచుతామని టిడిపి కూటమి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్‌ను జులై 1 నుంచి పంపిణీ చేయనున్నారు. పెంచిన పింఛన్‌తో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు నెలకు రూ.వెయ్యి చొప్పున బకాయితో కలిపి మొత్తం రూ.7వేలను లబ్ధిదారుల ఇంటి వద్దకే పంపిణీ చేయనున్నారు. సచివాలయ సిబ్బందితో పంపిణీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేపట్టారు. సచివాలయ పరిధిలో ఎంత మంది పింఛన్‌దారులు ఉన్నారు..ఎంత మంది సిబ్బంది పింఛన్ల పంపిణీకి అవసరం అవుతారు అన్న విషయాలపై కసరత్తు చేపడుతున్నారు. జులై 1న ఉదయం 6 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించి సాధ్యమైనంత వరకూ ఆ రోజు సాయంత్రానికి లబ్ధిదారులందరికీ పింఛన్లను పంపిణీ చేసేలా చర్యలు చేపడుతున్నారు.

# ఆదమరిస్తే కాలులోకే

**పంచాయతీ అధికారుల నిర్లక్ష్యమే కారణం**

**ప్రజాశక్తి-పత్తికొండ**

పత్తికొండ పట్టణం లోని నాలుగు స్తంభాల సమీపంలో పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు అదమరిస్తే కాలువలోకి పడాల్సిందేనని వాహనదారులు కాలనడకన వెళ్లే ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం సుదూర ప్రాంతాల నుండి వేలాదిమంది ప్రజలు అవసరాల నిమిత్తం పత్తికొండకు వస్తూ ఉంటారు. పగిలిపోయిన కాలువ మార్గంలో షాపింగ్ మాల్, హోటల్, ఇంటర్నెట్ సెంటర్లు ప్రజా అవసరాల నిమిత్తం షాప్‌లు కలిగి ఉన్నాయి. పంచాయతీ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండి పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువపై మరమ్మతులు చేసి, అందుబాటులోకి తీసుకురావాలని పట్టణ గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

## లోక్ అదాలత్ ద్వారా బకాయిల వసూళ్లు

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

కర్నూలు నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళికా అధికారులు శనివారం ప్రజల నుండి భవన అనుమతి ఫీజు బకాయిలను లోక్ అదాలత్, కర్నూలు ద్వారా వసూలు చేశారు. ఇందులో డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్య, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు అయిన రంగస్వామి, శశిలత, బిల్డింగ్ పర్యవేక్షకులు అయిన మంజులమ్మ , శబరీష్ , మస్రత్ అలీ ఖాన్, టౌన్ ప్లానింగ్ సూపర్ ఇంటిండెంట్ సుబ్బన్న, జూనియర్‌అసిస్టెంట్లు అయిన భార్గవ్ , నరసింహులు , వార్డు ప్లానింగు కార్యదర్శులు , ఇతర సిబ్బంది హాజరు అయ్యారు.

## కేంద్ర మంత్రి ఎస్‌పి సింగ్‌బగేల్‌ను కలిసిన కర్నూలు ఎంపీ

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్** : కేంద్ర మత్స్య, పశు సంవర్ధక , పాడి పరిశ్రమ, పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ఎస్‌పి సింగ్ బగేల్‌ను కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు మర్యాద పూర్వకంగా కలిసారు. ఢిల్లీలోని బగేల్ నివాసంలో ఆయనను కలిసిన నాగరాజు శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపి నాగరాజు కర్నూలు జిల్లా అభివృద్ధికి సహకారం అందించాలని, కేంద్ర సహాయ మంత్రి బగేల్ ను కోరారు. తెలుగుదేశం పార్టీ నాయకులు రామకృష్ణ, మద్దిలేటి పాల్గొన్నారు.

# పందులు పొర్లాడే చోట తాగునీటి సరఫరా

**-కలుసిత మైన నీరు తాగి ఆసుపత్రుల పాలవుతున్న ప్రజలు**

**-పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు -పిపిఎస్ఎస్ ధర్నా**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

కలుషిత నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతూ ఇబ్బందుల పాలవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవ్వరూ పట్టించుకోవడం లేదని పట్టణ పౌరసంక్షేమ సంఘం నాయకులు విమర్శించారు. పందులు పొర్లాడే స్థలం పక్కన తాగునీటిని పైపుల వాల్ ఫిట్స్, శిధిలమైన పైపులైన్ల నీటిలో పందులు పొర్లాడే విషయం నగరపాలక సంస్థ నీటిపారుదల ఇంజనీర్లకు తెలియదా? అని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎం నాగరాజు, వార్డు అభివృద్ధి కమిటీ ప్రతినిధులు రిటైర్డ్ డిఎస్‌పి, న్యాయవాది పాపారావు, కె.రంగస్వామి ప్రశ్నించారు. నగరంలో కుళాయిలో వస్తున్న కలుస్తమైన నీళ్లు, అపరి సుభ్రమైన స్థలంలో ఉన్న వాల్‌ఫిట్స్, లీకేజైన పైపులైన్ల ఫొటోలతో వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు పట్టణ పౌరసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం నగరపాలక సంస్థ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని కాలనీలలో మున్సిపల్ కొళాయిల ద్వారా వస్తున్న నీళ్లతో స్నానం చేస్తే ఒళ్లంతా దురదలు వస్తున్నాయని అధికారుల దృష్టికి తెచ్చిన స్పందించడం లేదని విమర్శించారు. మున్సిపల్ కొళాయిల్లో వస్తున్న కలుషిత మైన నీరు తాగి ప్రజలు అనారోగ్యాల గురవుతున్న విషయం అధికారులకు, పాలకులకు తెలియదా? అని ప్రశ్నించారు. ఉదాహరణకు కలెక్టరేట్ పక్కనే పైపులైను లీకైన నీటిలో పందులు పొర్లాడే చేస్తున్నాయన్నారు. గత ఐదేళ్ల నుండి అనుభవమున్న అనేకమంది సిబ్బంది రిటైర్ అవుతున్నారు. 1,20,000 మంది జనాభా ఉన్న శివారు కాలనీలకు ఒకే ఒక్క ట్యాప్ ఇన్‌స్పెక్టర్ ఉన్నారని విషయం తెలిసి కూడా కార్పొరేటర్లు, ఇంజనీర్లు నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. అనుభవజ్ఞులైన కొత్తవారిని నియమించి స్వచ్ఛమైన తాగునీరును సరఫరా చేయాలని కోరారు. కలుషితమైన తాగునీరు వల్ల జరగరానిది ఏదైనా జరిగితే పాలకులు అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. నగరపాలక సంస్థ మేనేజరు చిన్న రాముడు వినతిపత్రం తీసుకొని కలుషితమైన నీరు రాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నగర నాయకులు ఎ.వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసులు, ఎన్.మద్దిలేటి, ఎస్.రమణ గౌడ్, ఎన్. శ్రీనివాసరెడ్డి, ఆర్ట్ చిన్న, వివిధ కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు వి.విజయ్, కె. వెంకటరామిరెడ్డి, ఎస్.అన్వర్, ఎస్.యూనిస్, బి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు పుల్లారెడ్డి

# విద్యుత్ శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

## ఎస్ఇకి యుఇఇయు వినతి

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

విద్యుత్ శాఖలో ప్రతి సంవత్సరం అనేకమంది వివిధ క్యాడర్లలో పనిచేస్తూ వారందరూ పదవి విరమణ పొందుతున్నారు. ఆ పోస్టులన్నిటిని డిపిసి(డిపార్ట్ మెంటల్ ప్యానెల్ కమిటీ) జరిపి సీనియార్టీ ప్రకారం పోస్టుటు పోస్టు ఇవ్వాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఎస్‌పిడిసిఎల్ కంపెనీ కమిటీ, ఉపాధ్యక్షులు, పి.నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం కర్నూలు జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్, ఎం. ఉమాపతి ని కలిసి ఆయన ఛాంబర్‌లో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ లైన్ మెన్, మొదులుకొని అసిస్టెంట్ లైన్ మెన్, లైన్ మెన్, లైన్ ఇన్స్ పెక్టర్, సీనియర్ లైన్ ఇన్స్‌పెక్టర్, ఫోర్ మెన్ గ్రేడ్ -1, టెస్ట్ గ్రేట్ -1, ఫిల్టర్ ఆపరేటర్, వైండర్, సారంగ్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, రెవిన్యూ క్యాషియర్, ఎస్ఐఆర్‌సి, జూనియర్ అకౌంట్ ఆఫీసర్, అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇంజనీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సూపర్‌ఇంటెండింగ్ ఇంజనీర్, చీఫ్ ఇంజనీర్ క్యాడర్‌లలో ఉద్యోగులందరూ ప్రతి సంవత్సరం ఉద్యోగ విరమణ పొందుతున్నారన్నారు. ఈ పోస్టులన్నింటికీ తక్షణమే డిపిసి జరిపి సీనియారిటీ ప్రకారం పోస్టు టు పోస్టు పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా గతంలో పోస్టుటు పోస్ట్ ఇవ్వకుండా కొన్ని కార్మిక సంఘాల వత్తిళ్లకు అధికారులు రూల్స్ విరుద్ధంగా పోస్టింగ్ ఇచ్చారన్నారు. ఈ సంవత్సరం రూల్స్‌కు విరుద్ధంగా పోస్టింగ్ ఇవ్వకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ చేసిన క్యాడర్లలో హైక్యాడర్ లలో ఉన్న ఉద్యోగులకు ముందుగా డిపిసి. జరిపి, సీనియార్టీ ప్రకారం పోస్టు టు పోస్టు ఇవ్వాలన్నారు. ఆ తర్వాత లోయర్ క్యాడర్ ఉద్యోగులకు ఇదే పద్ధతిలో పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని తెలిపారు.

## కెఇ సైన్యం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-మద్దికేర :** కెఇ సైన్యం ఆధ్వర్యంలో గుండెపోటుతో మరణించిన టైలర్ వలి కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం తన ఇంటి దగ్గర ఉన్న కుటుంబ సభ్యులకు నిత్యవసర సరుకులను అందజేశారు.వారు మాట్లాడుతూ యువకుడైన టైలర్ వలి హఠాత్తుగా మరణించడం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు భయాందోళనకు గురికాకుండా మనోధైర్యంతో ఉండాలని టిడిపి నాయకులు పరామర్శించారు.

ఎన్‌టిఆర్ జీవిత చరిత్ర వ్యాససంపుటిని ఆవిష్కరిస్తున్న మంత్రి టిజి.భరత్

## ఎన్‌టిఆర్‌కు భారతరత్న ఇవ్వాలి : మంత్రి భరత్

**ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్ :** తెలుగుజాతి వైభవాన్ని విశ్వావ్యాపితం చేసిన అరుదైన ప్రజానాయకుడు కీర్తిశేషులు నందమూరి తారకారామారావు అని ఆయనకు భారతరత్న ఇచ్చి గౌరవించాలని రాష్ట్ర వాణిజ్య , పరిశ్రమలశాఖామంత్రి టిజి. భరత్ అన్నారు. శనివారం ఉదయం ఆయన స్వగృహంలో ఎన్‌టిఆర్ జీవితం పై రచించిన 108 వ్యాసాల సంపుటి పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ వ్యాస సంపుటిలో కర్నూలుకు చెందిన పత్తి ఓబులయ్య, చంద్రశేఖర కల్కూర ఎస్‌డివిఅజీజ్ రాసిన వ్యాసాలు ఉండటంతో వారిని ఆయన అభినందించారు. ఈ సంపుటిని ఆవిష్కరించాక టిజి.భరత్ మాట్లాడుతూ రామారావు అడుగుపెట్టిన సినిమా , రాజకీయ రంగం సేవారంగం అన్నిటిలో ఆదర్శప్రాయునిగా నిలిచారన్నారు. ప్రస్తుతం ఎన్‌డిఎ గవర్నమెంట్ కేంద్రంలో ఉన్నందున ఆయనకు భారతరత్న పురస్కారం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం పత్తి ఓబులయ్య రచించిన తెలుగు భోజుడు గ్రంధాన్ని కూడా ఆవిష్కరించారు. రచయితలు సమాజ హితం కోరే రచనలు చేయాలని అందుకు తమ ప్రభుత్వం సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఆవిష్కరణ కార్యక్రమంలో కళాక్షేత్రం ఉపాధ్యక్షులు సంగా ఆంజనేయులు, రంగస్థలం నటులు గాండ్ల లక్ష్మన్న ఉన్నారు.

## పారిశ్రామిక కారిడార్లు పూర్తి చేయాలి:డివైఎఫ్ఐ

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

కర్నూలు జిల్లాకు 2014 ఆగస్టు 15న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఓర్వకల్లు పారిశ్రామిక హబ్, ఎమ్మిగనూరు టెక్స్‌టైల్ పార్క్, ఆదోని జిన్నింగ్ ప్రెస్సింగ్ మిల్లులు పత్తికొండ టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఆలూరులో జింకల పార్కు ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.రాఘవేంద్ర, వై.నగేష్ డివైఎఫ్ఐ కార్యాలయంలో శనివారం ఒక సంయుక్త ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాల పునర్విభజన తరువాత అత్యంత వెనకబడిన జిల్లాగా కర్నూలు జిల్లా ఉందని పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో సాగు,తాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని, పారిశ్రామిక అభివృద్ధిని చేయకపోతే ఇప్పుడే ప్రతి సంవత్సరం ఆరు లక్షల మంది వలస వెళ్తున్నారని తెలిపారు. రాబోయే కాలంలో జిల్లా అంతా వలసలో బ్రతకాల్సిన దుర్భర పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన చెందారు. హైదరాబాద్, బెంగళూరు ,చెన్నై, నగరాలకు మధ్యలో ఉన్న ఒకప్పటి రాజధాని కర్నూలు నగరానికి ఐటి ఫార్మా బిపిఒ కంపెనీలను , ఉల్లి, వేరుశనగ ప్రాసెసింగ్ కంపెనీలను తీసుకురావడానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి. భరత్, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేయాలని డిమాండ్ చేశారు.

కేసు వివరాలు తెలుసుకుంటున్న న్యాయమూర్తి

## రాజీ మార్గమే రాజమార్గం

**- జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులు సత్వర పరిష్కారం**

**- 7వ అదనపు జిల్లా జడ్జి భూపాల్ రెడ్డి**

**ప్రజాశక్తి - ఆదోని**

వివిధ కేసుల ద్వారా కోర్టులకు హాజరవుతున్న బాధితులు రాజీ మార్గం ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవచ్చని 7వ అదనపు జిల్లా జడ్జి జి.భూపాల్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ఆదోని జిల్లా కోర్టు ప్రాంగణంలో వివిధ రకాల కేసులను వారు పరిష్కరించారు. ఏళ్ల తరబడి వివిధ కేసుల్లో కోర్టుల చుట్టూ తిరుగుతూ విసుగు చెందిన బాధితులు జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులను సత్వర పరిష్కారం చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బాధితులకు సూచించారు. వివిధ రకాల కేసులకు సంబంధించిన దాదాపు 78 కేసులను న్యాయమూర్తులు పరిష్కరించారు. అనవసరంగా కాలాన్ని వృథా చేసుకోకుండా, కోర్టుల చుట్టూ తిరగకుండా వివిధ కేసులకు సంబంధించిన వారు జాతీయ లోక్‌అదాలత్ ద్వారానే తక్షణ పరిష్కారం పొందవచ్చని తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి యగ్న నారాయణ, జూనియర్ సివిల్ జడ్జి జి.అర్చనతోపాటు జాతీయ లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాదులు సి.ఆనంద్, బి.రామాంజి, మహ్మద్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

## పరిశుభ్రతతోనే అంటువ్యాధులు దూరం

**- ఇఒఆర్‌డి బాలన్న, ఎఎన్ఎం సువర్ణమ్మ**

**ప్రజాశక్తి - చిప్పగిరి**

క్లీన్ అండ్ గ్రీన్ చేపడుతున్న పంచాయతీ కార్మికులు

నివాస ప్రాంతాల్లో పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుకుంటే ఏ అంటువ్యాధులు కూడా దరిదాపుల్లోకి రావని ఇఒఆర్‌డి బాలన్న, సచివాలయ ఎఎన్ఎం సువర్ణమ్మ తెలిపారు. శనివారం నేమకల్లు గ్రామంలో ఇఒఆర్‌డి బాలన్న ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా పలు వీధుల్లో పంచాయతీ కార్మికుల చేత పరిసరాలను శుభ్రం చేయించారు. అంటువ్యాధులైన డయేరియా, మలేరియాపై ప్రజలకు, మహిళలకు తగు సూచనలు ఇస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అపరిశుభ్రమైన వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి, యాంటీ లార్వా సోడియం హైపోక్లోరిట్ క్రిమి సంహారకాలను స్ప్రే చేయిస్తున్నామని తెలిపారు. ఇంట్లో వంట సామగ్రిని శుభ్రంగా ఉంచుకోవడం, ఎయిర్ కూలర్లు, ఏవైనా పాత డబ్బాలు వంటి వాటిల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని కోరారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల బారినపడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ లక్ష్మి, ఆశాలు కవిత పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

**- యుటిఎఫ్ నాయకులు**

**ప్రజాశక్తి - ఆదోని**

ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న నాయకులు

ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గాది లింగప్ప, జిల్లా సహాధ్యక్షులు జీవిత, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు కోరారు. శనివారం ఆదోనిలోని ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథికి అభినందనలు తెలిపి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిఒ 117ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఆర్థిక బకాయిలను చెల్లించాలని, ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆడిట్ సభ్యులు మల్లికార్జున, పట్టణ నాయకులు సునీల్ రాజ్‌కుమార్, సీనియర్ నాయకులు పాపయ్య, కృష్ణమూర్తి, బసప్ప, మల్లయ్య, పెద్దయ్య, రుద్రముని, భోజరాజు, నారాయణ, నాగేంద్ర, శివకుమార్ గౌడ్, ఆవుల బసప్ప, వేణుగోపాల్, బాలాజీ రావు, ఓంకార్, రంగన్న, రంగారెడ్డి, వెంకటేశ్వర్లు, రాముడు, జగన్, విష్ణువర్ధన్ రెడ్డి, చెన్నయ్య, గంగాధర్, చక్కెర భాస్కర్, మనోహర్, హనుమంతు, వెంకటరమణ, లింగన్న పాల్గొన్నారు.

# స్వరం పెంచిన కౌన్సిలర్లు

**- అధికారులు వర్సెస్ కౌన్సిలర్లు అన్న రీతిలో సాగిన సమావేశం**

**- గౌరవ సభ్యులుగా, కౌన్సిలర్‌గా హాజరైన ఎమ్మెల్యే పార్థసారథి**

**ప్రజాశక్తి - ఆదోని**

ఇన్నేళ్లు గమ్మున ఉన్న వైసిపి కౌన్సిలర్లు రెచ్చిపోయారు. అధికారులు వర్సెస్ వైసిపి కౌన్సిలర్లు అన్న రీతిలో కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. శనివారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఛైర్మన్ శాంత అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి గౌరవ సభ్యులుగా ఎమ్మెల్యే పార్థసారథి హాజరయ్యారు. అంతకుముందు ఎమ్మెల్యే పార్థసారథికి కమిషనర్ రామచంద్ర రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ వెంకట చలపతి రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. సభ ప్రారంభం కాగానే మున్సిపల్ కౌన్సిలర్లు సమస్యలపై అధికారులను నిలదీశారు. సమావేశంలో లేవనెత్తిన సమస్యలను రికార్డు చేయాలని కౌన్సిలర్ బాలాజీ విజ్ఞప్తి చేశారు. ప్రతి అంశాన్నీ మినిట్స్‌లో పొందుపరుస్తున్నామని కమిషనర్ రామచంద్ర రెడ్డి వివరణ ఇచ్చారు. వాకిటాకులు కొనుగోలు చేశారే తప్ప ఎవరితో ఉన్నాయో చెప్పాలని, ఆ విషయాన్ని పలు దఫాలుగా కౌన్సిల్ దృష్టికి తెచ్చినా స్పందన లేదని బాలాజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం ఎంతవరకు సమంజసమని అసహనం వ్యక్తం చేశారు. అమృత స్కీం కింద విడుదలైన నిధులకు టాక్స్ మున్సిపల్ జనరల్ ఫండ్స్ చెల్లించడం ఏమిటని కౌన్సిలర్ సందీప్ రెడ్డి ప్రశ్నించారు. బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో ముసలిని పట్టినందుకు రూ.2 లక్షలు ఖర్చు అని చెప్పడం అభ్యంతరకరమని నిలదీశారు. మున్సిపాలిటీలో ఎంత మేర నిధులు ఉన్నాయో తెలపాలని కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి ప్రశ్నించారు. రూ.2 కోట్ల నిధులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. టిడిపి కౌన్సిలర్ అని గత రెండేళ్లుగా నిర్లక్ష్యాన్ని గురవుతూనే ఉన్నామని, తమ వార్డులో ఎలాంటి అభివృద్ధి జరగలేదని 1వ వార్డు కౌన్సిలర్ పార్వతి నిలదీశారు. కొండ ప్రాంతం నుంచి వర్షపునీరు కాలనీలోకి రావడం వల్ల ఇళ్లల్లోకి చేరుతున్నాయని, ఎన్నిసార్లు చెప్పినా నివారణ చర్యలు చేపట్టలేదని అభ్యంతరం తెలిపారు. వీరభద్ర స్వామి టెంపుల్ వద్ద డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని, భక్తుల సౌకర్యార్థం నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ హసీనా భాను కోరారు. తాగునీటి ఎద్దడి ఉందని, తమ కాలనీ వైపు చూడాలని ఆమె అధికారులను కోరారు. ఆల్ఫా స్కూల్ వద్ద కల్వర్టు డ్రెయినేజీ రోడ్డు సౌకర్యం కల్పించాలని కౌన్సిలర్ ఉస్మాన్ కోరారు. అజెండా తయారు చేసే ముందు సభ్యులతో సంప్రదించకుండా ఏకపక్షంగా ఎలా తయారు చేస్తారని వైస్ ఛైర్మన్ నరసింహులు ప్రశ్నించారు. ఛైర్మన్ అనుమతి లేకుండానే అజెండాలో ఎన్నో అంశాలు పొందుపరిచారని, వాటిని తాము ఆమోదించబోమని అభ్యంతరం తెలిపారు. మెయింటనెన్స్ కింద ఏకపక్షంగా నిధులు దుర్వినియోగం చేసే దిశగా అధికారులు వ్యవహరిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని నరసింహులు తెలిపారు.

**ఆదోని అభివృద్ధికి పాటుపడదాం**

వెనకబడిన ఆదోనిని అభివృద్ధి చేసే దిశగా సమిష్టిగా పాటు పడదామని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కౌన్సిలర్లకు విజ్ఞప్తి చేశారు. అజెండా తయారు చేసే సమయంలో కూడా కూలంకుశంగా చర్చించి, రూపొందిస్తే సమస్యలు రావని, పొరపాటు జరగకుండా చూసుకోవాలని ఛైర్మన్ శాంతకు ఎమ్మెల్యే సూచించారు. అధికారులను బాధ్యులు చేసే దిశగా కౌన్సిలర్లు మాట్లాడుతున్నారని, తప్పు ఎక్కడ జరిగిందో చర్చించుకున్నప్పుడే తెలుస్తుందని, సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు. అన్ని వార్డుల్లోనూ పర్యటిస్తామని, సమస్యలను కచ్చితంగా పరిష్కరించేలా చూస్తామని తెలిపారు. రాజకీయాలు అన్నది ఎన్నికల వరకేనని, అభివృద్ధి వైపు అందరూ దృష్టి సారించాలని చెప్పారు. వైస్ ఛైర్మన్ మహ్మద్ గౌస్, డిఇలు రాజు నాయక్, ఎఇలు రాజశేఖర్ రెడ్డి, కృపాకర్, కౌన్సిలర్లు చిన్న నాగరత్నమ్మ, హిందూ, లోకేశ్వరి, రాజేశ్వర్ రెడ్డి, వసీం, అశోక్, రాజేశ్వరి, భారతి, మీనుగా లక్ష్మి, ఫయాజ్, కో ఆప్షన్ సభ్యులు తిమ్మక్క ఉన్నారు.

సమస్యలపై నిలదీస్తున్న కౌన్సిలర్లు

సభనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

## శ్రీమఠంలో హైకోర్టు జడ్జి అశోక్

**ప్రజాశక్తి - మంత్రాలయం**

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని కర్ణాటక హైకోర్టు జడ్జి అశోక్ శనివారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీమఠం సహాయక పిఆర్ఒ హొన్నొళ్లి వ్యాసరాజాచార్ స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళహారతులు స్వీకరించారు. ఆయనకు ఎస్ఐ గోపినాథ్ సిబ్బందితో తగిన భద్రత కల్పించారు.

## పింఛన్ల పంపిణీ బాధ్యత నుంచి మినహాయింపు ఇవ్వాలి

**- ఎఎన్ఎంల డిమాండ్**

**ప్రజాశక్తి - ఆదోని**

పింఛన్ల పంపిణీ బాధ్యత నుంచి తమకు మినాయింపు ఇవ్వాలని ఎఎన్ఎంలు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్ల బాధ్యత వెల్ఫేర్ సెక్రటరీ, వాలంటీర్లు నిర్వహించేవారు. జులై 1 నుంచి వాలంటీర్లు కాకుండా సచివాలయ ఉద్యోగులతోనే ఇంటి వద్దనే పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సచివాలయ పరిధిలోని అడ్మిన్ వెల్ఫేర్, డేటా ప్రాసెసింగ్, మహిళా పోలీసు, ఇమ్యూనిటీ, శానిటేషన్, ప్లానింగ్, హెల్త్ సెక్రటరీలకు పింఛన్ల పంపిణీ బాధ్యత ప్రభుత్వం అప్పగించింది. పింఛన్ల పంపిణీ మూడు రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. పింఛన్ల పంపిణీలో పాల్గొనడం వల్ల వ్యాక్సినేషన్ టీకాలు వేయడం వంటి కార్యక్రమాలకు ఆటంకం కలుగుతుందని ఎఎన్ఎంలు చెబుతున్నారు. పింఛన్ల పంపిణీ బాధ్యత నుంచి మినహాయింపు ఇవ్వాలని అధికారులను కోరుతున్నారు. ఎలాంటి సంబంధమూ లేని ఎఎన్ఎంలకు బాధ్యత అప్పగించడం ఏమిటని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

**డయేరియా అవగాహనకు ఆటంకం :** డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి జులై 1 నుంచి ఆగస్టు చివరి వరకు రెండు నెలలు డయేరియాపై సర్వే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పింఛన్ల పంపిణీ బాధ్యత వల్ల డయేరియా అవగాహన కార్యక్రమానికి ఆటంకం కలుగుతుందని, అధికారులు గమనించాలని ఎఎన్ఎంలు కోరుతున్నారు.

# దళిత వృత్తులకు బతుకు భరోసానివ్వాలి

**- ఎపిడికెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ బాబు**

**ప్రజాశక్తి - కోసిగి**

మానవ సమాజం అభివృద్ధి చెందుతున్న క్రమంలోనే ఆవిర్భవించిన ఆదిమ సామాజిక కళ డప్పు కళ అని, ఆ డప్పు వృత్తిని భుజానేసుకున్న వారితో పాటు దళిత వృత్తిదారులందరికీ బతుకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌డి.ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. శనివారం కోసిగిలోని ఓ ప్రయివేట్ గృహంపై సమావేశం నిర్వహించారు. కెవిపిఎస్ మండల కార్యదర్శి రామకోటి హనుమంతు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ బాబు, ఎపిడికెఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గర్జి అంజి, ఎం.చిన్న మారయ్య మాట్లాడారు. తరతరాలుగా సామాజిక వృత్తులన్నీ పాలకుల నిర్లక్ష్యానికి గురవుతూ వస్తున్నాయన్నారు. డప్పు, చర్మ వృత్తులకు సంఘం పెట్టి కొంత సాధించినా, శ్మశానంలో వృత్తిని చేసే కాటికాపరులను నేటికీ వృత్తిగా గుర్తించడం గానీ, వారి సమస్యలపై దృష్టి పెట్టడం గానీ జరగలేదని తెలిపారు. డప్పు కళాకారులకు, చర్మకారులకు వృత్తి పింఛను 2019లో సాధించుకుంటే, అణచివేతలకు గురైన ఈ వృత్తి పింఛన్‌ను సమాజంలో ఇచ్చే ఇతర పింఛన్లతో కలిపి తిరిగి వివక్ష పాటిస్తున్నారని తెలిపారు. వృత్తి పింఛన్లు రూ.6 వేలకు పెంచాలని, డప్పు పింఛను వయస్సును 45 ఏళ్లకు తగ్గించాలని కోరారు. కాటికాపరులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి భృతిని కల్పించాలన్నారు. ఆకలితో, అంటరానితనంతో, పౌష్టికాహార లేమితో, అపరిశుభ్రాల మధ్య జీవిస్తున్న దళిత వృత్తిదారులందరికీ ప్రభుత్వమే ప్రత్యేక బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 4న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి సమావేశంలో మరింత చర్చించి ప్రభుత్వం ముందు ఉంచుతామన్నారు. పరిష్కరించకపోతే ఉద్యమించేందుకు సిద్ధం కావాలని కోరారు. రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వీరేష్, మత్స్య కార్మికుల సంఘం నాయకులు నాగేంద్ర పాల్గొని సంఘీభావం తెలిపారు. కెవిపిఎస్ మంత్రాలయం మండల అధ్యక్షులు ఈరన్న, కౌతాళం మండల కార్యదర్శి తాయన్న, చర్మకారుల సంఘం మంత్రాలయం మండల కార్యదర్శి రాజు, కోసిగి డప్పు కళాకారుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పెద్ద హనుమంతు, ముక్కురన్న, కోసిగి కాటికాపరుల సంఘం మండల కార్యదర్శి ఫిలిప్, కోసిగి చర్మకార వృత్తిదారుల సంఘం మండల అధ్యక్షులు జేజప్ప పాల్గొని మాట్లాడారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్ బాబు

## కరివేముల ఎంపిటిసి మృతి

**ప్రజాశక్తి - దేవనకొండ**

మండలంలోని కరివేముల గ్రామానికి చెందిన వైసిపి ఎంపిటిసి మాల రంగమ్మ(55) శనివారం మృతి చెందారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు సేవించి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. ఈ విషయమై సిఐ శ్రీనివాసులును వివరణ కోరగా... కుటుంబ సభ్యులు, గ్రామస్తుల నుంచి ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

## సచివాలయంలో చోరీ

**ప్రజాశక్తి - ఆదోని**

పట్టణంలోని 27వ సచివాలయంలో చోరీ జరిగిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. సచివాలయ వార్డు అడ్మిన్ రవి కుమార్, సిబ్బంది, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పింఛన్‌కు సంబంధించిన రూ.17 లక్షలు బ్యాంకు నుంచి తీసుకొచ్చి లెక్కిస్తుండగా, గుర్తు తెలియని వ్యక్తి వచ్చి మాయమాటలు చెప్పి రూ.50 వేలు లాక్కొని ఉడాయించాడు. సచివాలయ సిబ్బంది ఎంత వెతికినా దొరక్కపోవడంతో త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## దరఖాస్తు చేసుకున్న వారందరికీ హాస్టల్ సీటు ఇవ్వాలి

**- డిడికి ఎస్ఎఫ్ఐ వినతి**

**ప్రజాశక్తి - ఆదోని**

అత్యంత వెనుకబడిన ఆదోని ప్రాంతంలోని దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికీ బీసీ హాస్టల్‌లో సీటు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం బీసీ వెల్ఫేర్ డిడి వెంకటలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదోనిలోని బీసీ హాస్టల్‌లో సీటు దొరకక మధ్యలోనే చదువు మానేసే పరిస్థితి ఉందన్నారు. బీసీ హాస్టల్‌లో ప్రతినెలా మెడికల్ క్యాంపు నిర్వహించాలని, బీసీ హాస్టల్ సొంత భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. లేకపతోఏ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

## డిసిఎం, బొలేరా వాహనం ఢీ

**- భక్తులకు గాయాలు**

**ప్రజాశక్తి - మంత్రాలయం**

మండలంలోని కలుదేవకుంట, చిలుకలడోన గ్రామాల మధ్య డిసిఎం, బొలేరా వాహనాలు ఢీకొని భక్తులకు గాయాలయ్యాయి. శనివారం ఎస్ఐ గోపినాథ్ తెలిపిన వివరాల ప్రకారం... అవినాష్ అనే డ్రైవర్ మహారాష్ట్రలోని లాతూర్ జిల్లా హంసకు చెందిన ఎంహెచ్ 25 యు 1208 నెంబర్ గల డిసిఎం లారీ గుల్బర్గా - చింతామణి నుంచి బయల్దేరారు. హనుమంతరాజు అనే డ్రైవర్ మహేంద్ర బొలేరా వాహనం కెఎ 34ఎం 4562 నెంబర్ గల వాహనంలో మంత్రాలయం బయల్దేరారు. కర్ణాటక రాష్ట్రంలోని తుమ్కూర్ సమీపంలో తెల్లవారుజామున రెండు వాహనాలూ ఢీకొన్నాయి. రమ్య, శ్రుతి అనే మహిళలకు తీవ్ర గాయాలు కాగా మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుట్టా ప్రతుల్ చేతుల మీదుగా పట్టణంలోని 40 మంది కెజిబివి 10వ తరగతి విద్యార్థులకు శనివారం పుస్తకాలు పంపిణీ చేశారు. బుట్టా ప్రతుల్ మాట్లాడుతూ... బుట్టా ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఎమ్మిగనూరులో కూడా సేవా కార్యక్రమాలు చేయడానికి ముందుంటామని చెప్పారు. బుట్టా ఫౌండేషన్ మేనేజర్ చరిత, కెజిబివి ప్రిన్సిపల్ కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'నిరుపయోగంగా శౌచాలయ కంటైనర్'

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోని పోలీసు కంట్రోల్ రూమ్ సమీపంలో కొత్తగా నిర్మించిన శౌచాలయం కంటైనర్ నిరుపయోగంగా ఉందని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు దిలీప్ ఢోకా తెలిపారు. శనివారం బహిర్భూమి నిర్మూలన కోసం నిర్మించి తాళం వేసిన శౌచాలయం కంటైనర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం ఆచరణ అంతంత మాత్రంగానే ఉందని విమర్శించారు. పట్టణంలో మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం తీరు అందుకు అద్దం పడుతోందన్నారు. ప్రజాధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు చేసి నిరుపయోగంగా మార్చడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి స్పందించి శౌచాలయం కంటైనర్‌ను ఉపయోగంలో తీసుకురావాలని కోరారు. ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ప్రజలకు ఉపయోగపడే ప్రతి అంశంపై సమీక్షిస్తున్న తీరుపై హర్షం వ్యక్తం చేశారు. అవసరమైతే ఆదోని అభివృద్ధికి తాము కలిసి పని చేసేందుకు సహకరిస్తామన్నారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి రావు, పట్టణ అధ్యక్షులు సాయినాథ్, పట్టణ యువజన అధ్యక్షులు దేవిశెట్టి వీరేష్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు మాణిక్యరాజు, కాంగ్రెస్ నాయకులు హనుమంతు, మదిరే తలారి మానయ్య పాల్గొన్నారు.

# దళితుల సమస్యల పరిష్కారానికి కృషి

**- కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవసహాయం**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

దళితుల సమస్యల పరిష్కారానికి ఐక్యతతో కూడిన ఉద్యమాలే శరణ్యమని, ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవ సహాయం, జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్ తెలిపారు. శనివారం స్థానిక కెవిపిఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సంఘం మండల నాయకులు చిన్నప్ప అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దేవసహాయం, కరుణాకర్, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మామిడికాయల రాజు, చర్మకార వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి, మండల కార్యదర్శులు సుమాల ఆంథోని, సుమాల రాజు, కెవిపిఎస్ సీనియర్ నాయకులు బాలస్వామి, కెవిపిఎస్ మండల మాజీ కార్యదర్శి ఆనంద్ రావు మాట్లాడారు. దళితుల సమస్యల పరిష్కారం పట్ల శ్రద్ధ లేని పాలకవర్గాలు సమస్యలపై దృష్టి పెట్టాలంటే అణగారిన సామాజిక తరగతుల్లో ప్రశ్నించే చైతన్యాన్ని పెంచుకోవాలన్నారు. దేశవ్యాప్తంగా దళితులపై దాడులు, దౌర్జన్యాలు నిత్యకృత్యంగా జరుగుతూనే ఉన్నాయన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న డప్పు చర్మకారుల గుర్తింపు, పింఛను, సబ్‌ప్లాన్ చట్టం వంటి హక్కులు సహితం ఒక్కొక్కటిగా ధ్వంసం అవుతున్నాయని తెలిపారు. సబ్‌ప్లాన్ చట్టం ఉన్నా నిధులేమవుతున్నాయో తెలియదని చెప్పారు. అట్రాసిటీ చట్టం కింద అరెస్టు అయినా స్టేషన్ బెయిలిస్తున్నారని గుర్తు చేశారు. పాలకులు సామాజిక వర్గాలకు న్యాయం చేస్తామంటూనే పింఛన్ల విషయంలో వృత్తిదారులైన డప్పు, చర్మ వృత్తి కళాకారులను గుర్తించలేదన్నారు. శ్మశానంలో గుంతలు తీసే కాటికాపరులు గుంతలు తవ్వుతు అనారోగ్యాల పాలవుతున్నారని, ఏ ప్రభుత్వాలు వారి వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదని విమర్శించారు. దళిత వృత్తులు నేటికీ అంటరానితనాన్ని భరిస్తూనే బతుకుతున్నాయని తెలిపారు. నాయకులు ఆనంద్, లక్ష్మన్న, భాస్కర్, కొర్నేలీ, దేవేంద్రతో పాటు మరో 60 మంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవ సహాయం

# కష్టకాలంలో అండగా ఉందాం

**- ప్రజాదరణతోనే వైసిపికి 40 శాతం ఓట్లు**

**- మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

కష్టకాలంలో వైసిపికి అండగా నిలుద్దామని, హామీల అమలుపై ప్రభుత్వంపై పోరాటం చేద్దామని మాజీ ఎంపీ, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, రాష్ట్ర వీరశైవ లింగాయత్ మాజీ ఛైర్మన్ వై.రుద్ర గౌడ్ తెలిపారు. శనివారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లోని వైసిపి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపికి ప్రజల్లో ఆదరణ ఉన్నందుకే సార్వత్రిక ఎన్నికల్లో 40 శాతం ఓట్లు వచ్చాయని తెలిపారు. పార్టీ శ్రేణులు అధైర్య పడవద్దని, అండగా ఉంటామని భరోసానిచ్చారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉండాలని సూచించారు. ప్రత్యర్థి కూటమిలోని మూడు పార్టీలు కలిసి తప్పుడు ప్రచారం, మోసపూరిత హామీలతో అధికారం చేజిక్కించుకున్నారని విమర్శించారు. పార్టీ శ్రేణులు ధైర్యంగా ఉండాలని, ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పార్టీలు మారుతారన్న పుకార్లను నమ్మవద్దని సూచించారు. పట్టణంలో ఎవరూ టిడిపికి భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. గెలుపొందిన కూటమి నాయకులు హామీల అమలుపై దృష్టి సారించాలన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ప్రజల పక్షాన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. రానున్న స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని, పట్టణ పార్టీ శ్రేణులు ఐక్యతతో పని చేసి ఆయా ఎన్నికల్లో సత్తా చాటాలని కోరారు. నాయకులు బుట్టా శివ నీలకంఠ, వైసిపి మండల కన్వీనర్ బిఆర్.బసిరెడ్డి, యువ నాయకులు బుట్టా ప్రతుల్, రాష్ట్ర శాప్ నెట్‌వర్క్ మాజీ ఛైర్మన్ మాచాని వెంకటేష్, మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ కెఎస్.రఘు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ బుట్టా రేణుక

## టిడిపిలోనూ లబ్ధి పొందాలని చూస్తే సహించేది లేదు

**- కూటమి నాయకులు**

**ప్రజాశక్తి - హొళగుంద**

కొందరు వైసిపి నాయకులు, కార్యకర్తలు గత ఐదేళ్లగా వైసిపిలో లబ్ధి పొంది నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టిడిపిలో చేరి ఇక్కడా లబ్ధి పొంది అధికారం కోసం ఆరాటపడటం మానుకోవాలని కూటమి నాయకులు హెచ్చరించారు. శనివారం స్థానిక రైస్ మిల్లులో కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు ఈడిగ గోవింద్ గౌడ్, దుబ్బు ఎర్రిస్వామి, పంపాపతి, ఈరన్న గౌడ్, మైనార్టీ నాయకులు మహ్మద్ ఆదమ్ మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వంలో మండలంలో ముఖ్య నాయకులుగా చలామణి అవుతూ వివిధ రకాల లబ్ధి పొందారని, అధికారం అనుభవించి నేడు టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మరోసారి అధికారాన్ని అనుభవించాలనే దురుద్దేశంతో ముఖ్య నేతలతో టిడిపిలో చేరడానికి ప్రయత్నించడం సిగ్గులేనితనానికి నిదర్శనమని విమర్శించారు. గత ఐదేళ్లుగా మాజీ ముఖ్యమంత్రి జగన్ అరాచకాలు భరించలేక రాష్ట్ర ప్రజలు 2024 సాధారణ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి 164 సీట్లు ఇచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సామాజిక పింఛన్లు 4 వేలకు పెంచి, ఏప్రిల్ నుంచి జూన్ నెల వరకు రూ.వెయ్యి ప్రకారం అరియర్స్ ఇచ్చి జులైలో మొత్తం రూ.7 వేలు ఇంటి వద్దకే అందించే బాధ్యత తీసుకున్నారని తెలిపారు. ప్రతి కార్యకర్త పింఛనుదారులకు తెలియజేయాలని కోరారు.

మాట్లాడుతున్న నాయకులు

## పోస్టుమేన్ రాఘవులు సేవలు ప్రశంసనీయం

**- టిడిపి నాయకులు రాఘవేంద్ర రెడ్డి**

**ప్రజాశక్తి - మంత్రాలయం**

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని పోస్టాఫీసులో పోస్టు మేన్‌గా విధులు నిర్వహించిన బి.రాఘవులు సేవలు ప్రశంసనీయమని టిడిపి నాయకులు ఎన్.రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక రామచంద్ర నగర్ కాలనీలోని రాఘవులు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయన కుమారులు వరదరాజులు, శ్రీనివాసులు, హనుమేష్, విజయ్‌లు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాఘవేంద్రరెడ్డితో పాటు పలువురు పాల్గొని రాఘవులు దంపతులకు శాలువాలు, పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా వరదరాజులు కూడా ఆయనకు, నాయకులు అశోక్ రెడ్డికి శాలువాలు, పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరెడ్డి మాట్లాడారు. 44 సంవత్సరాల పాటు పోస్టుమేన్‌గా సేవలు అందించారని చెప్పారు. రాఘవులు స్థానికులు కావడంతో ఆయన అందరికీ సుపరిచితులని, మంచి ప్రజాదరణ ఉన్న వ్యక్తి అని కొనియాడారు. పౌరాణిక నాటకరంగంలో సైతం తన ప్రతిభను చాటి మన్ననలు పొందారని, గ్రామంలో ఏ నాటకం వేసినా ఆయన అందులో పాల్గొని విజయవంతానికి కృషి చేస్తారని తెలిపారు. శ్రీరాఘవేంద్ర నాటక కళా సమితిలో సభ్యులుగా కొనసాగుతుండడం హర్షణీయమని చెప్పారు. టిడిపి నాయకులు అశోక్ రెడ్డి, సర్పంచి భీమయ్య, వైసిపి నాయకులు జనార్ధన్ రెడ్డి, పతంజలి రవి స్వామి, ప్రసన్న స్వామి, వడ్డె నారాయణ, చిన్న సుంకప్ప, ఎంపిటిసి నక్కి వెంకటేష్, రఘు, నరసింహ, డేనియల్, శివ డేవిడ్ పాల్గొన్నారు.

రాఘవేంద్రరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

**మహారాజ శ్రీ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు కర్నూలు**

**O.S.No.2/2023**

యం.లక్ష్మిదేవి భర్త యం.శ్రీనివాసులు,
హిందూ, వయస్సు 40 సం॥రాలు,
బిజినెస్, R/o ఇంటి నెం.51/97/ఎ10,
సీతారామనగర్, కర్నూలు. ...వాది

V/s

యం. వెంకటస్వామి తండ్రి యం.ఉశేనయ్య,
ఇంటి నెం.49/50ఎ 174, శ్రీరామ్‌నగర్,
కర్నూలు టౌన్. ...ప్రతివాది

**ప్రతివాదికి దావా నోటీసులు**

వాది దావా విషయమై ప్రతివాది మీద పై కోర్టులో దావా దాఖలు చేసియున్నది. సదరు దావా నందు కోర్టు వారు ప్రతివాదికి పంపిన నోటీసులు తీసుకోకుండా ఉన్నందుకు ఇందు మూలముగా ప్రతివాదికి తెలియజేయడమేమనగా 08.07.2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై నీకున్న ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల దావాను మీకు పరోక్షముగా తీర్మానించెదరు.

**(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)**

**వాయిదా తేది : 08-07-2024**

**కె.భాస్కర్,**
వాదిపరం న్యాయవాది,
నందికొట్కూరు.